అధ్యాపకురాలి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్ట్


మదనపల్లె : పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో ఈ నెల మూడో తేదీన జరిగిన ప్రైవేట్ కళాశాల లెక్చరర్ రుక్సానా హత్య కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుక్సానా హత్య కేసును క్రైమ్ నంబర్ 136/2023 కింద 120(బి), 341, 302, 506, 509.1పీసీ రెడ్‌విత్34 సెక్షన్లు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పట్టణంలోని శివాజీనగర్ చీకలగుట్టకు చెందిన ఎస్.షబ్బీర్‌బాషా అలియాస్ కలిచెర్ల షబ్బీర్‌బాషా, సురభికాలనీకి చెందిన షేక్ ఫారుఖ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో కీలక పాత్రధారులైన ముగ్గురు నిందితులు షేక్ ప్యారేజాన్, సులేమాన్, షేక్ అహ్మద్‌లతో పాటుగా భర్త ఖదీర్‌అహ్మద్, మరో ముగ్గురి అరెస్ట్ చూపారు. సోమవారం మరో ఇద్దరిని అరెస్ట్ చేయడంతో ఈ కేసులో ఇప్పటి వరకు 9 మంది అరెస్ట్ అయ్యారు.

ఆర్టీసీ బస్సులు ఢీ..

ఓబులవారిపల్లె : మండలంలోని మంగంపేట జాతీయ రహదారిపై సోమవారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. కడప వైపు వెళ్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సును వెనుక నుంచి నాన్ స్టాప్ ఏసీ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మదనపల్లె.. సమరయోధుల ఖిల్లా


పాపన్నగుప్త


మదనపల్లెలోని బీటీ కాలేజీ

మదనపల్లె సిటీ : స్వాతంత్య్ర ఉద్యమంలో మదనపల్లె వాసులు తమదైన ప్రభావం చూపారు. బ్రిటీష్ వారిని తరిమికొట్టడంలో ఏకత్వం చాటారు. విదేశీ వనిత డాక్టర్ అనిబిసెంట్ మదనపల్లెలో బీటీ కాలేజీ స్థాపించారు. ఇక్కడే స్వాతంత్య్ర పోరాటాలకు వేదికగా మారింది. అజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా త్యాగధనులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

జాతిపిత బాటలో నూతి రాధాకృష్ణయ్య

మదనపల్లె పట్టణం శాస్త్రి వీధికి చెందిన నూతి రాధాకృష్ణయ్య మదనపల్లె గాంధీగా పేరు పొందారు. గాంధీజీ ప్రారంభించిన ఉప్పు సత్యాగ్రహంలో ప్రధానపాత్ర వహించారు. 1941లో చిత్తూరు బస్టాండు వద్దనున్న మైదానంలో సభ ఏర్పాటు చేశారు. తాను సొంతంగా రాసిన పద్యాలతో గొంతెత్తి ఆలపించారు. బ్రిటీష్ పోలీసులు ఆయన్ను వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు. విదేశీ వస్త్ర బహిష్కరణలో భాగంగా ఖాదీ వస్త్రాలు ధరించాలని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. 1935లో ఖాదీబండార్ నెలకొల్పారు. ప్రజలకు స్వాతంత్య్ర ఉద్యమ ఆవశ్యతను తెలియజేసేందుకు పత్రికలను ప్రచార సాధనాలుగా ఉపయోగించారు. 1999లో అనారోగ్యంతో ఆయన మృతి చెందారు.

విదేశీ వస్త్రబహిష్కరణలో పాపన్న అలుపెరగని పోరాటం

మదనపల్లె పట్టణం కోర్టు రామాచారి వీధికి చెందిన పాపన్నగుప్త బీటీ కళాశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ అనిబిసెంట్ ఉపన్యాసాలకు ఆకర్షితురాలై పదిహేనేళ్ల బాలంలోనే స్వాతంత్య్ర పోరాటబాట పట్టారు. గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1986లో అనారోగ్యంతో మృతి చెందారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో టి.గోపాలకృష్ణయ్య

క్విట్ ఇండియా ఉద్యమంలో మాజీ ఎమ్మెల్యే గోపాలకృష్ణయ్య చురుగ్గా పాల్గొన్నారు. గాంధీ పిలుపు మేరకు ఆయన ఉద్యమాల్లో పాల్గొన్నారు.

ఉప్పు సత్యాగ్రహంలో రామకృష్ణారెడ్డి

చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్‌గా పని చేసిన టి.ఎస్.నాగిరెడ్డి కుమారుడు టి.ఎస్.రామకృష్ణారెడ్డి ఉప్పు సత్యాగ్రహంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన్ను బ్రిటీష్ ప్రభుత్వం ఆరు నెలలు వేలూరు, తిరుచినాపల్లి జైలుల్లో పెట్టారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలోని ఎరువుల దుకాణాలపై కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు రెడ్డెప్ప, శేషగిరి ఆధ్వర్యంలో అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. రికార్డులు, అనుమతులు సరిగ్గాలేని రూ. 5,52 లక్షల ఎరువుల విక్రయాలపై నిషేధం విధించారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు ఈ దాడులు కొనసాగాయి. దుకాణాలు, గోడౌన్లలో స్టాకును పరిశీలించారు. ఎరువులు, పురుగుల నివారణ మందుల స్టాకు, విక్రయాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. దుకాణాల్లో విక్రయిస్తున్న ఎరువులు, పురుగుల మందుల నాణ్యత, ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీవిఘ్నేశ్వర, శ్రీకృష్ణా ఎరువుల దుకాణాల్లో రికార్డులు సరిగ్గా లేనట్లు గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. దుకాణాలు, గోడౌన్లలో నిల్వ ఉన్న ఎరువులు విక్రయించిన ఎరువుల వివరాలతోపాటు మరికొన్ని విషయాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయనట్లు గుర్తించామన్నారు. శ్రీవిఘ్నేశ్వర ఎరువుల దుకాణంలో రూ.3,20,850, శ్రీకృష్ణా ఎరువుల దుకాణంలో రూ.2,31,400 మొత్తం రూ. 5,52,250 విలువ చేసే ఎరువులని రైతులకు విక్రయించకూడదంటూ నిషేధం విధించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇరువురు దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఎరువులను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఈఈ కేవీ కిషోర్, ఏవో నాగరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న బైక్

- యువకుడి మృతి
- మరొకరి పరిస్థితి విషమం

నిమ్మనపల్లె : విద్యార్థులతో వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సును బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు... కేవీ పల్లె మండలం గర్నిమిట్ట పంచాయతీ లక్ష్మిరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు శ్రీరాములు అలియాస్ రెడ్డి(20) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. తన బంధువైన కలికిరి మండలం శెట్టిపల్లెకు చెందిన మల్లేష్(21)తో కలిసి మూడు రోజుల క్రితం నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లెలోని బంధువుల ఇంటికి అల్లనేరేడు పంటను కోసేందుకు వచ్చారు. పనులు ముగించుకుని ఇద్దరూ సోమవారం ఉదయం దివిటివారిపల్లె నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామాలకు బయలుదేరారు. మార్గంమధ్యలో కొండయ్యగారిపల్లె పంచాయతీలోని మదనపల్లె-నిమ్మనపల్లె మార్గంలో నిమ్మనపల్లె వ్యవసాయ శాఖ కార్యాలయం సమీపంలో, ఆటోను ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీరాములుకు మెడ భాగంలో తీవ్ర గాయాలు కాగా, మల్లేష్‌కు కాలు, చెయ్యి విరగడంతో పాటు తలకు తీవ్ర గాయమైంది. బాధితులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీరాములు అలియాస్ రెడ్డి మృతి చెందగా, మల్లేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. శ్రీరాములు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. నిమ్మనపల్లె ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు


తీవ్రంగా గాయపడ్డ ముజీర్

నిమ్మనపల్లె : రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె గాండ్ల వీధికి చెందిన దంపతులు ముజీర్(60), షాహినా(50) మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ సాగిబండవారిపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చారు. శుభకార్యం ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళుతున్నారు. బాలినాయనపల్లెకు చెందిన కె.రూపేష్(25) ద్విచక్రవాహనంలో వేగంగా వస్తూ.. వెంగంవారిపల్లె సెల్‌టవర్ వద్ద ఎదురుగా వస్తున్న ముజీర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో ముజీర్ తలకు తీవ్ర గాయం కాగా, అతని భార్య షాహినా, మరో ద్విచక్రవాహనంలోని రూపేష్ గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముజీర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు తొలగింపు

కలికిరి: ప్రభుత్వం స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలను సోమవారం తహసీల్దారు భాగ్యలత తొలగించారు. మండల పరిధిలోని కలికిరి రెవెన్యూ గ్రామ దాఖలా సర్వే నెంబరులో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు ఇటీవల జగనన్న కాలని పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టరు గిరీషా పీఎస్ గుర్తించారు. అక్రమ కట్టడాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దారు భాగ్యలతను ఆదేశించారు. ఈ సందర్భంగా ఐదుగురు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తహసీల్దారు గుర్తించారు. సోమవారం ఉదయం జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. నిర్మాణదారులు అడ్డురావడంతో పోలీసుల సాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. ఆక్రమిత స్థలం డ్వామా డిపార్ట్‌మెంట్‌కు సంబంధించినది కావడంతో సంబంధిత అధికారులకు అప్పగించనున్నట్లు ఆమె తెలిపారు. అలాగే సర్వే నెంబరు 560లోని కాలువ స్థలము 10 సెంట్లు విస్తీర్ణము ఆక్రమణకు గురికావడంతో వాటిని తొలగించారు. మండల సర్వేయరు దేవి, ఆర్ఐ చాణుక్య, విఆర్ఓలు విశ్వనాథ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను కాపాడుదాం

– డీఎస్పీ మహబూబ్‌బాషా

పీలేరు రూరల్ : ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో మెలిగి దేశ సమగ్రతను కాపాడాలని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి వంద అడుగుల జాతీయ జెండా ప్రదర్శనతో పీలేరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్, నాలుగు రోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహాలకు పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ నరసింహులు, నాయకులు మహిత, కాలనీ చిన్న, షాకీర్, మునీర్, అబీద్, గడిబాషా, చక్రధర్, ద్వారకనాథరెడ్డి, సాంబశివారెడ్డి, సునీల్‌రెడ్డి, నరేష్ రామ్‌కుమార్‌రెడ్డి, చిన్నయల్లప్ప, నరేష్, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే ధ్యేయం

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను అనుగుణంగా అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలో రెండవ విడత పల్లెబాట కార్యక్రమం నిర్వహణపై ఎమ్మెల్యే సోమవారం అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘమిత్రలు పని తీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. జవాబుదారీగా ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది, పార్టీలకతీతంగా విధులు నిర్వర్తించాలన్నారు. 45 ఏళ్ళ రాజకీయ అనుభవం అని చెప్పుకునే చంద్రబాబుకు సీఎం కుర్చీపై ఉన్న మక్కువ రాష్ట్ర అభివృద్ధిపై లేదని ఎద్దేవా చేశారు. టీడీపీ ఉనికి కాపాడుకునేందుకు చంద్రబాబు నీచ రాజకీయాలకు తెరలేపారన్నారు. అల్లరి మూకలను రెచ్చగొట్టి నిత్యం సీఎం వైఎస్ జగన్‌ను, పెద్దిరెడ్డి కుటుంబంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. నిషేధిత భూముల జాబితాలో ఉన్న చుక్కల భూములతో పాటు 2000-2004కు ముందు డీకేటీ పట్టాలు పొందిన రైతుల భూములను ముఖ్యమంత్రి రెగ్యులరైజ్ చేస్తూ పట్టా భూములుగా అవకాశం కల్పించారని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో ప్రత్యామ్నాయ పంటగా 80 శాతం ప్రభుత్వ రాయతీతో అందజేసే ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పంట నమోదైతేనే ఇన్సూరెన్స్ వర్తిస్తుందని ఏఓ ప్రేమలత అన్నారు. ప్రజా ప్రతినిధులు మహమూద్, సుబ్బరాం, డ్రిప్ రమణ, రియాసత్ అలీఖాన్, కేవీ రమణ, పప్పు రాజారెడ్డి, పట్టెరిక శంకర్, ఖాదర్‌వలి, కార్యం చంద్ర, తమక శంకర్, కొట్టిమల్లి అధికారులు గిరిధర్‌రెడ్డి, ఉత్తన్న, శ్రీహరి, నారాయణ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా అభివృద్ధికి కృషి చేయండి

తంబళ్లపల్లె: మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా ప్రజా సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశించారు. సోమవారం స్త్రీశక్తిభవన్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకూ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, అర్హులై ఉండి పథకాలు అందని వారి నివేదికలను ఇవ్వాలన్నారు. ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. క్లిష్టమైన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి ప్రణాళిక బద్ధంగా రోజు గ్రామాలలో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మండల ప్రత్యేక ఆహ్వానితులు చినరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, జమాల్ బాషా, మల్లయ్యకొండ చైర్మన్ మల్లిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భార్గవరెడ్డి, రెడ్డిమల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కరీమ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు కోటిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లె : నాటుసారాను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ముష్టూరు పంచాయతీ దిగువపల్లెకు చెందిన జనార్ధన(25) నాటుసారాను తయారు చేసి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో నిఘా ఉంచామన్నారు. సోమవారం సాయంత్రం దిగువపల్లె సమీపంలో నాటుసారాను విక్రయిస్తుండగా, సిబ్బందితో కలిసి దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

వారపు సంత స్థలాల కబ్జాపై విచారణ

గుర్రంకొండ: గుర్రంకొండ పంచాయతీలోని వారపు సంత స్థలాల కబ్జాపై ఎంపీడీఓ వెంకటేశులు విచారణ జరిపారు. వారపుసంతతో పాటు పాత పంచాయతీ భవనం పరిధిలోని ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించుకొని రేకుల షెడ్లు వేసుకొన్నారని, మరికొందరు వాటిని ఇతరులకు అద్దెలకు ఇచ్చుకొంటున్నారంటూ గ్రామస్తులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో సోమవారం ఎంపీడీఓ వెంకటేశులు తమ సిబ్బందితో కలసి వారపుసంత, పాతపంచాయతీ భవనం పరిసరాల్లో ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. అక్రమంగా రేకుల షెడ్లు వేసుకొన్నట్లు విచారణలో తేలింది. ఆక్రమణ దారులందరికి వెంటనే నోటీసులు జారీ చేయాలని పంచాయతీ ఈఓ విశ్వనాథ్‌ను ఆదేశించారు.

గుర్రంవాండ్లపల్లె సర్పంచ్‌గా సుధాకర

పెద్దమండ్యం: మండలంలోని గుర్రంవాండ్లపల్లె గ్రామ సర్పంచ్‌గా బి. సుధాకర ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు సోమవారం తెలిపారు. గ్రామ సర్పంచ్‌గా ఉన్న మల్లయ్యనాయుడు అనారోగ్యంతో మృతిచెందడంతో అక్కడ ఎన్నికకు అధికారులు నామినేషన్‌లు స్వీకరించారు. గ్రామ పరిధిలోని బత్తినగారిపల్లెకు చెందిన బి సుధాకర సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ఒక్క నామినేషన్ మాత్రమే రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. అలాగే మండలంలోని వెలిగల్లులో గ్రామంలోని 6 వవార్డు మెంబర్‌గా అమీన్‌పీర్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆస్తి కోసమే డాడీ హోం రాజారెడ్డి హత్య


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : డాడీ హోం నిర్వాహకుడు నల్లదిమ్ము రాజారెడ్డిని ఆస్తి కోసమే హత్య చేశారు. సొంత తమ్ముడే పథకం ప్రకారం మరో ఇద్దరి సాయంతో గొంతునులిమి హతమార్చాడు. సీఈఓ బాధ్యతల నుంచి లక్ష్మీప్రసన్నను తొలగించడం, ఆస్తి గొడవలు హత్యకు ప్రధాన కారణంగా పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులోని ఐదుగురు నిందితులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్, జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు సోమవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. రాజుపాళెం మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన డాడీ హోం నిర్వాహకుడు రాజారెడ్డి ఈ నెల 11న రాత్రి పూజా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో పడిపోవడంతో బంధువులు, పాఠశాల సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఆస్పత్రికి వెళ్లి రాజారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ విషయమై అక్కడి వైద్యులతో మాట్లాడగా గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చని ప్రాథమికంగా తెలిపారు. పూజా స్కూల్ పీఈటీ రామాంజని ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో 12న ఉదయం రాజారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. తర్వాత పోస్టుమార్టం చేసిన డాక్టర్ అసిస్టెంట్‌ని విచారణ చేయడంతో పోస్టుమార్టంలో కొన్ని లోపాలున్నట్లు పోలీసు అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప రిమ్స్‌కు చెందిన ప్రొఫెసర్లతో రాజారెడ్డి మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఊపిరాడక రాజారెడ్డి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

10 రోజుల నుంచి హత్యకు కుట్ర

రాజారెడ్డి తమ్ముడి భార్య లక్ష్మీప్రసన్న కొన్నేళ్ల నుంచి డాడీ హోం సీఈఓగా కొనసాగుతున్నారు. అయితే ఇటీవల సీఈఓ పదవి నుంచి ఆమెను రాజారెడ్డి తొలగించారు. ఈ బాధ్యతలను డాడీ హోంలో ఉంటున్న అనాథ యువతికి అప్పగించారు. దీంతో లక్ష్మీప్రసన్న దంపతులు ఈ విషయాన్ని బంధువులు, సన్నిహితులతో చెప్పుకొంటూ బాధపడ్డారు. వీరి మధ్య ఆస్తి వివాదాలు కూడా కొన్ని రోజుల నుంచి కొనసాగుతున్నాయి. దీంతో పగ పెంచుకున్న శ్రీధర్‌రెడ్డి, భార్య 10 రోజులుగా రాజారెడ్డిని చంపేందుకు కుట్ర పన్నుతూ వచ్చారు.

రోస్టర్‌లో డాక్టర్ డ్యూటీ లేకున్నా..

ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ వీరనాథరెడ్డి జనరల్ సర్జన్‌గా పని చేస్తున్నాడు. ఆయన రాజారెడ్డి ఫ్యామిలీ డాక్టర్. అంతేగాక శ్రీధర్‌రెడ్డితో మంచి సంబంధాలు కలిగి ఉన్నాడు. 11న రాత్రి డాక్టర్ వీరనాథరెడ్డికి డ్యూటీ లేకున్నా జిల్లా ఆస్పత్రిలో ఉన్నాడు. ఆ రోజు రాత్రి రాజారెడ్డి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ఆయన మరణానికి గుండె పోటు కారణమని డాక్టర్ వీరనాథరెడ్డి ప్రాథమికంగా తెలియజేశాడు. అంతేగాక మరుసటి రోజు 12న పోస్టుమార్టం చేసి గుండె పోటు వల్లనే రాజారెడ్డి మృతి చెందినట్లు ఆయన తెలిపాడు. పోలీసులకు అనుమానం రావడంతో తిరిగి నిర్వహించిన రీ పోస్టుమార్టంలో ఊపిరాడక రాజారెడ్డి మృతి చెందినట్లు రిమ్స్ ప్రొఫెసర్లు తెలిపారు. డాక్టర్ వీరనాథరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా


నిమ్మనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం సాయంత్రం నిమ్మనపల్లె పంచాయతీలోని తురకపల్లె, కొత్తపల్లె, బోడుమల్లయ్యగారిపల్లె, కొత్త ఇండ్లు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, సదాశివరెడ్డిలతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. బుక్‌లెట్‌ను అందించారు. స్థానిక సమస్యలను గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమ గ్రామాలకు తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. అంతేకాకుండా తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే స్థానిక సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శశిధరరెడ్డి, మహమ్మద్‌రఫీ, హేమంత్, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కలకడ : అర్హత కలిగిన ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దిగువతండా, ఎగువతండా గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో కలిసి ఇంటింటి పర్యటన చేశారు. ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబం పొందిన లబ్ధిని వివరించారు. దిగువతండాలో పైప్‌లైన్, సిమెంట్ రోడ్డు, కాలువల నిర్మాణం, నలుగురికి టైలరింగ్, ఏడుగురికి పింఛన్ల అర్హత ఉండి మంజూరు కాలేదని కోరగా వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణం చేసిన నాటి నుంచి సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా ముందుకు వెళ్తున్నారన్నారు. ఎగువతాండలో నీరు, పైప్‌లైన్, ముగురునీటి కాలువల నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. రూ.20 లక్షల వరకూ పనుల ప్రాధాన్యతను బట్టి కేటాయిస్తామన్నారు. ఇళ్లు మంజూరు చేయాలని కోరిన ఐదుగురికి వెంటనే అర్హతను బట్టి మంజూరు చేయాలని ఏడీని ఆదేశించారు. సరిమడుగు బస్సు సమయం ప్రజలకు అవసరం మేరకు నడపాలని మదనపల్లె డిపో మేనేజర్‌కు సూచించారు. అలాగే రెవెన్యూ సమస్యలు పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్ ప్రదీప్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, పార్టీ మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయుడు, సర్పంచ్‌లు స్వరూప, జల్లా రాజగోపాల్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజనాయుడు, చింతకుంట హరినాథరెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.









ప్రజా సమస్యలు పరిష్కరించండి

మదనపల్లె : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువమాచిరెడ్డిపల్లెకు చెందిన ఆటోడ్రైవర్ షేక్‌ముబారక్ తనకు ఎలాంటి ఆస్తులు, ఇళ్లు లేకపోయినప్పటికీ మదనపల్లె మున్సిపాలిటీలో ఇల్లు ఉన్నట్లు చూపిస్తోందని, దీని కారణంగా తనకు ప్రభుత్వం నుంచి వాహనమిత్ర పథకం రావడం లేదని ఆర్డీఓకు ఫిర్యాదు చేశాడు. తన ఆధార్‌నెంబర్‌పై చూపిస్తున్న అసెస్‌మెంట్ నెంబర్‌ను రద్దుచేసి తనకు ప్రభుత్వపథకం వచ్చేలా చూడాలని వేడుకున్నాడు. మదనపల్లెలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, భవన నిర్మాణానికి స్థానిక రెడ్డెప్పనాయుడు కాలనీలో సర్వేనెంబర్ 328లో సుమారు 8 గుంటలు భూమిని అప్పటి సబ్‌కలెక్టర్ మంజూరు చేస్తూ ఎస్సీ కార్పొరేషన్ నుంచి భవన నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేశారని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ తెలిపారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, భవననిర్మాణ పనులు ప్రారంభించాలంటే ఎస్సీ కార్పొరేషన్ అధికారులు రెవెన్యూ అధికారుల నుంచి సర్టిఫికెట్ అడుగుతున్నారని, మంజూరు చేయాల్సిందిగా వినతి చేశారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

పీలేరు రూరల్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. వంద మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, లెమన్ స్పూన్ రేస్, శాక్ రేస్ (గోనిసంచె), స్కిప్పింగ్ పోటీల్లో 20 పాఠశాలలకు చెందిన విద్యార్థులు సుమారు 130 మంది పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు.











